క్లుప్తంగా

ఉచిత కంటి ఆపరేషన్‌కు 30 మంది ఎంపిక



కంటి రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బంగారుపాళెం: మండల కేంద్రమైన బంగారుపాళెంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 30 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్టు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. 55 మంది రోగులకు పరీక్షలు చేశారు. అందులో 30 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు మురళీకృష్ణ తెలిపారు.

జెడ్పీ కార్యాలయం తనిఖీ



జెడ్పీ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న సీఈఓ

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ కార్యాలయ అనుబంధ విభాగాలను సీఈఓ గ్లోరియా సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలోని గణాంకాలు, ప్రణాళిక, పీఎఫ్, విద్య, వ్యవస్థాపక విభాగాల గదులను ఆమె పరిశీలించారు. విభాగాల వారీగా ఎంత మంది ఉద్యోగులు, సిబ్బంది ఉండాలి..? ఎంత మంది ఉన్నారు? అనే వివరాలు ఏఓలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కార్యాలయ పరంగా కావాల్సిన కంప్యూటర్లు, ఇతర సామగ్రి వివరాలు గురించి మాట్లాడారు. ఉద్యోగుల ఖాళీలు, విద్యుత్ పరికరాల అవసరాల నివేదికను సిద్ధం చేసి ఇవ్వాలని ఆదేశించారు.

ఆర్టీసీ లక్కీడిప్ విజేతలకు బహుమతులు



పుంగనూరు: ఆర్టీసీ లక్కీడిప్ విజేతలకు సోమ వారం డీఎం సుధాకరయ్య బహుమతులు పంపిణీ చేశారు. పుంగనూరు డిపో నుంచి వివిధ రూట్లలో ఆర్టీసీ సర్వీసుల్లో ప్రయాణించే ప్రయాణికులకు లక్కీడిప్ నిర్వహిస్తుండడం విదితమే. రాయచోటి, ముళబాగిల్, మేటిమంద, కలికిరి, తిరుపతి రూట్లలో ప్రయాణించిన ప్రయాణికులు గిఫ్ట్ బాక్సుల్లో వేసిన టికెట్లను లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి బహుమతులు ఇచ్చినట్టు డీఎం చెప్పారు. వివిధ ప్రాంతాలకు చెందిన అహమ్మద్‌బాషా, బాషా, ఎస్.వెంకట్రమణ, అలివేలమ్మ, పాల్‌బాషా, ఆర్వీ.రెడ్డి, శిల్ప, సంతోష్ లకు బహుమతులు పంపిణీ చేసి, వారిని అభినందించారు. సురక్షిత ప్రయాణాలకు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని డీఎం కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ సంధ్య, మెకానిక్ సూపరింటెండెంట్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

కరెంటుతో జరభద్రం



పచ్చని పంట



వరిపొలంలో పారుతున్న నీరు

- వర్షాకాలంలో విద్యుత్ తీగలు, మోటార్ల విషయంలో అప్రమత్తత ముఖ్యం
- నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం

చిత్తూరు కార్పొరేషన్: రుతుపవనాలతో తొలకరి జల్లులు కురవడం, మృగశిర కార్తె కూడా ప్రారంభం కావడంతో రైతులు పొలం బాట పట్టారు. ఇప్పటికే పొలాలను దుక్కి దున్నే పనుల్లో నిమగ్నమయ్యారు. ఆపై విత్తనాలు విత్తినప్పటి నుంచి పంట దిగుబడి వచ్చేవరకూ వ్యవసాయ పనులపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తారు. అలాగే పంటలకు నీరు పెట్టడం కోసం తెల్లవారితే చాలు విద్యుత్ తీగలు, విద్యుత్ మోటర్ల వద్ద ఎక్కువగా పని చేస్తుంటారు. చాలా మంది రైతులు చిన్నచిన్న విద్యుత్ మరమ్మతులను స్వయంగా వారే చేస్తుంటారు. ఇలాంటి సమయంలో జాగ్రత్తలు వహించకపోతే మృత్యువాత పడే అవకాశం ఉంది. పొలాల్లో కర్ర స్తంభాలు, వేలాడుతున్న తీగల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ట్రాన్స్‌కో అధికారులు హెచ్చరిస్తున్నారు.

రైతులు తక్కువ ధరల మోటర్లను ఎక్కువగా వాడుతుంటారు. చాలా మంది రైతులు మోటర్లు ఆరుబయట బావి ఒడ్డు, కాలువ ఒడ్డున ఉంచి చిన్న కవర్ కప్పి ఉంచుతారు. అవి కొన్నిరోజులకే దెబ్బతింటాయి. అనంతరం వాటిని పట్టించుకోకపోవడంతో మోటర్లతో ప్రమాదం పొంచి ఉండే అవకాశం ఉంది. సింగిల్ ఫేజ్ తీగ కాలికి తగిలితే మోటరు మొత్తానికి విద్యుత్ ప్రవహిస్తుంది. దానిని తాకగానే కరెంటు షాక్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో తగు జాగ్రత్తలు వహిస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉండవచ్చని అధికారులు చెప్తున్నారు.

స్టార్టర్లతో జాగ్రత్తలు ఇలా..

స్టార్టర్ డబ్బాలను మోటర్ పక్కనే పొలంలో ఉంచి రైతులు కవర్లు కప్పుతూ ఉంచారు. ఇది ప్రమాదాలకు తావిచ్చే అవకాశం లేకపోలేదు. డబ్బాలకు ఉన్న తలుపుల గురించి పట్టించుకోరు. వాటిలోకి నీరు చేరుతుంది. తీగలు కూడా గజిబిజిగా ఉండేలా తెంపి మళ్లీ అతికిస్తారు. ఏ తీగ ఏ ఫేజు ఏదో కూడా తెలియని విధంగా ఉంటాయి కూడా. వీటిపట్ల కూడా కచ్చితమైన జాగ్రత్తలు పాటించాలని అధికారులు చెబుతున్నారు. రక్షణ కవర్లను తీసివేయరాదు. నేరుగా స్టార్టర్లకు విద్యుత్ సరఫరా అయ్యేలా ఫీజు అమర్చుకోవాలి. సొంతంగా మరమ్మతులు చేయడం మంచిది కాదు. స్టార్టర్ డబ్బాలకు తలుపులు తప్పనిసరిగా ఉండాలి.

ఇనుప డబ్బాలతో జాగ్రత్త

చాలా మంది రైతులు ఇప్పటికీ స్టార్టర్ల కోసం ఇనుప డబ్బాలను ఉపయోగిస్తారు. ఇనుప డబ్బాల్లో స్టార్టర్లు, ఫీజులు బిగించడంతో ఎలుకలు డబ్బాల్లోకి వెళ్లి, తీగలు కొరకడంతో ఆ తీగలు తెగి, డబ్బాకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఇది తెలియక రైతులు డబ్బాను పట్టుకునే ప్రయత్నం చేయగానే షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది.

తీగలతో ప్రమాదం

గాలివానలకు ఒక్కోసారి పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడుతూ ఉంటాయి. ఆ సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. అలాగే వ్యవసాయ పనులు ముగిసిన వెంటనే పొలంలో నుంచి విద్యుత్ తీగలను తీసుకువచ్చి ఇళ్లలో కట్టకట్టి పడేస్తుంటారు. ఆ సమయంలో ఎలుకలు కొరికే అవకాశం ఉంటుంది. రైతులు తీగలను ప్రారంభ సమయంలో తప్పనిసరిగా పరీక్షించాలి. అనంతరం మోటర్లకు తీగలను అమర్చుకోవాలి. పాత తీగల కంటే కొత్త తీగలను అమర్చుకోవడం మంచిది. విద్యుత్ స్తంభాలు దూరంగా ఉన్న ప్రదేశాల్లో కొందరు రైతులు మధ్య మధ్యలో తాత్కాలికంగా కర్రలు వేసుకుని వాటికి తీగలు అమర్చుతుంటారు. ఇవి వర్షానికి, గాలులకు కిందపడి ఉంటాయి. వాటిని గమనించకుండా పొలాల్లో పనులకు వెళ్లినప్పుడు అవి కాలికి తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. స్తంభాలు దూరంగా ఉంటే ట్రాన్స్‌కో సిబ్బందితో మాట్లాడి విద్యుత్ స్తంభాలు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

తప్పనిసరి జాగ్రత్తలు

పొలాల్లో మోటర్లు పనిచేయకపోతే చేతితో పట్టుకోకూడదు. టెస్టర్ సహకారంతో మాత్రమే పరీక్షించాలి. వర్షపు నీరు, తేమ తగలని చోటవాటిని అమర్చి రక్షణగా కవర్ కప్పాలి. ఎర్తింగ్ తప్పనిసరిగా ఉంచుకోవాలి. మోటరుకు ఏదైనా మరమ్మతులు చేయాలంటే ముందుగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయాలి.

భద్రంగా ఉండాలి




విద్యుత్ తీగలు, మోటార్ల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పనులు ప్రారంభించే ముందు మోటార్లకు అమర్చే వైర్లు తప్పనిసరిగా పరీక్షించుకోవాలి. లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రైతులు అప్రమత్తంగా తగు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చు.

– మునిచంద్ర, ఇన్‌చార్జి ఈఈ ట్రాన్స్‌కో

14, 15 తేదీల్లో ముత్యాలమ్మ జాతర

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఈ నెల 14, 15వ తేదీల్లో చిత్తూరు నగరం తేనెబండలో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో జాతను ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 14న ఉదయం 2 గంటలకు అభిషేకం, 6 గంటలకు సింహ వాహనంపై కొండ చుట్టు తిరునాళ్లు, రాత్రి 9 గంటలకు పుష్పపల్లకిపై అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 15న మధ్యాహ్నం నీవానది ఒడ్డున అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం 65 గంటలకు అగ్ని గుండ ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు.

సూర్య, శేషవాహనంపై ఇంద్రవరదుడు



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామి వారు

యాదమరి(పూతలపట్టు): యాదమరి మండల కేంద్రంలోని త్రివేణి సంగమంలో వెలసిన ఇంద్రవరదుని వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సూర్యప్రభ వాహనం, రాత్రి శేష వాహనంపై స్వామి వారిని కొలువుదీర్చి ఊరేగించారు. గ్రామస్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు గరుడోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గరుడోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించనున్నారు. ఉదయం అభిషేక పూజల పూర్తి చేసి తదనంతరం గరుడ సేవ ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే రాత్రి కల్ప వృక్ష వాహన సేవ ఉంటుందని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: గ్రామాల్లో వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని పొలకలలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వలు ఉన్నచోట దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ





ఉత్తమ ర్యాంకులు సాధించిన భూమిక, ప్రీతి

చిత్తూరు కలెక్టరేట్: నగరంలో మురుగానపల్లెలోని తమ కళాశాల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ చాటారని పీఎస్ఎన్ శ్రీ వివేకానంద కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఏటా తమ కళాశాలలో చదివిన విద్యార్థులు జేఈఈ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. గత విద్యా సంవత్సరంలో జేఈఈ పరీక్షలు రాసిన విద్యార్థులు జాతీయ స్థాయిలో ఐఐటీ ర్యాంకులు సాధించారన్నారు. భూమిక 3279, ప్రీతి 4239, చాందిని 4988, చరితి 16738 ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారని తెలిపారు. అనంతరం ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాగరాజశెట్టి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కక్ష సాధింపుతో దాడులు చేయడం సరికాదు

వి.కోట: రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, గెలుపొందిన కూటమి నాయకులు దాడులు, ఆస్తుల ధ్వంసానికి నాయకులు పాల్పడటం సరికాదని డీఎస్పీ విష్ణు రఘువీర్ హితవు పలికారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఎన్నికల ఫలితాల అనంతరం ఇటీవల కూటమి నాయకులు అక్కడక్కడా ధ్వంసం చేయడం, రోడ్లపై అల్లర్లు చేయడం, ప్రత్యర్థుల నాయకులపై రాళ్ల దాడులు చేయడం వంటివి చేస్తున్నారన్నారు. ఇదంతా తగదని, సంయమని పాటించి ప్రభుత్వ ఆస్తులను కాపాడటం అందరి బాధ్యత అని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్న వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం ఎంతమాత్రమూ తగదన్నారు. అన్నింటికీ చట్టాలున్నాయని, ఏదైనా సరే చట్టపరంగా చూసుకోవాలని సూచించారు. అందరి సమన్వయంతో రాష్ట్రాభివృద్ధి, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలపై కొత్త చట్టం అమలులోకి వచ్చిందని, ఈ నియమాలను ఉల్లంఘించిన వారికి భారీగా జరిమానా విధించడంతోపాటు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. కొత్త నియమ నిబంధనలకు వాహనదారులు పాటించాలని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని, సీట్ బెల్ట్ వాడాలని, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదని, బైక్‌పై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ప్యాసింజర్ ఆటోలు ఓవర్ లోడుతో వెళితే కూడా కేసులు తప్పవన్నారు.

దళితవాడలో జాతరకు విస్తృత ఏర్పాట్లు



గంగమ్మ



అమ్మవారి విద్యుత్ కటౌట్

బంగారుపాళెం: మండల కేంద్రమైన బంగారుపాళెం దళితవాడలో గంగమ్మ జాతరకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. దళితవాడలో ప్రతి సంవత్సరం జూన్ నెలలో జాతరను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా జాతరను నిర్వహించాలని పెద్దలు నిర్ణయించారు. గ్రామంలో విద్యుత్ దీపాలతో సుందరంగా అంకరించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన అమ్మవారి విద్యుత్ కటౌట్ ఆకట్టుకుంటోంది. జాతరలో భాగంగా మంగళవారం ఉదయం అంబళ్లు, సాయంత్రం పొంగళ్లు సమర్పించనున్నారు. రాత్రి అమ్మవారిని గ్రామంలో ఊరేగించనున్నారు. బుధవారం తెల్లవారు జామున అమ్మవారిని నడివీధిలోని మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం ఉట్ల తిరుణాళ్లు నిర్వహిస్తారు. ఆ తర్వాత అమ్మవారిని మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య జలప్రవేశానికి తరలించనున్నారు.

తగ్గువారిపల్లెలో..

మండలంలోని తగ్గువారిపల్లెలో మంగళవారం గంగమ్మ జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దండుమారెమ్మ ఆలయం వద్ద ఉదయం అంబళ్లు, సాయంత్రం అంబళ్లు సమర్పించనున్నట్లు తెలిపారు. బుధవారం రాత్రి అమ్మవారి జలప్రవేశానికి తరలించనున్నట్లు తెలిపారు.

భూసారంతో పంట భళా..!

- సమీకృత సాగు, పంట మార్పిడితో మేలైన దిగుబడులు
- చీడపీడల నుంచి రక్షణకు సరైన మార్గం
- ఎరువులు, మందుల ఖర్చు ఆదా
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు



పంటసాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

రైతు ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తాడు. తగిన దిగుబడి రాకుంటే నష్టాలపాలవుతాడు. ఏ పంటకు ఎంత మోతాదులో ఎరువులు వేయాలి. ఏ నేల ఏ పంటకు అనుకూలంగా ఉంటుంది అన్న వివరాలు ముందే తెలిస్తే రైతు నష్టపోయే అవకాశం తక్కువగా ఉంటుంది. అంతేగాక పంట మార్పిడి విధానంతో సూక్ష్మ పోషకాలు వృద్ధి చెందుతాయి. భూమి సారవంతమవుతూ పంటలకు అనుకూలంగా తయారవుతుంది. సమీకృత సాగు, పంట మార్పిడి విధానాల వల్ల అధిక దిగుబడి పొందవచ్చు. ఈ విషయాలను వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు వివరిస్తున్నారు. అధిక దిగుబడి సాధించి లాభాలు ఆర్జించేలా చర్యలు తీసుకుంటున్నారు. -కాణిపాకం

భూమిలో ఏయే ఖనిజలవణాలు ఉన్నాయి, పంటల సాగుకు ఏయే ఎరువులు అవసరమో ముందే తెలుసుకుంటే రైతులకు ఖర్చు తగ్గుతుంది. అంతేగాక భూమి కూడా సారవంతమవుతుంది. అలాగే పంట మార్పిడి విధానంతో చీడపీడల సమస్యను అధిగమించవచ్చు. ఒక పంటను ఆశించే తెగుళ్లు రెండో పంటను ఆశించవు. ఈ విధానం ద్వారా ఏడాదికి రెండు, మూడు పంటలను వేస్తే, ఏదైనా ఒక పంటకు గిట్టుబాటు ధర లేకున్నా వేరే పంటల వల్ల లాభం పొందవచ్చు. వివిధ పంటల్లో వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోవచ్చు. రైతులంతా ఒకే రకమైన పంట వేయడం వల్ల చీడపీడల ఉధృతి అధికంగా ఉంటుంది. తద్వారా దిగుబడి తగ్గడమే కాక మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించదు.

- పంట మార్పిడితో సస్యరక్షణ కోసం వాడే పురుగు మందుల ఖర్చు తగ్గించవచ్చు. వేర్లు భూమిలో తక్కువ లోతుకు చొచ్చుకుపోయే పైర్లను పంట మార్పిడి చేయడం వల్ల భూమిలోని వివిధ పొరల్లో ఉన్న తేమ పోషకాలను సమర్థవంతంగా వినియోగించుకుంటాయి.
- వేరుశనగ, ఇతర పంటలు వేసిన పొలంలో మిరప సాగుచేస్తే లాభసాటిగా ఉంటుంది. మిరప పంట వేసిన పొలంలో వేరుశనగ సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. మిరప పంట సాగు చేయడానికి ముందు ఆ భూమిలో జనుము, పిల్లి పెసర వంటి పంటలను సాగు చేసి, దాన్ని ట్రాక్టర్‌తో కలియదున్నితే భూసారం పెరిగి చీడపీడలు దరిచేరవు. పురుగులు ఉన్న ప్రాంతాల్లో టమాటా, బెండ, పెసర, మినుము పంటలు వేయరాదు. వాటిని వేస్తే పురుగులు మరింత అభివృద్ధి చెందుతాయి.
- పంట మార్పిడిలో భాగంగా నేలంతా పూర్తిగా కప్పే పంటలు ఎంపిక చేసుకోవాలి. వేరుశనగ, బొబ్బర్లు, పెసర, మినుము పంటలను వేసుకోవాలి. దీనివల్ల కలుపు మొక్కలు పెరగకుండా నివారించవచ్చు.
- వరి పంట తర్వాత పప్పుధాన్యాల పంటలను కానీ నూనె గింజల పంటలను కానీ సాగు చేయడంతో తెగుళ్లు ఆశించకుండా ఉంటాయి. భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వచేసే శక్తి ఉన్నప్పుడు ఏడాదిలో రెండు పంటలు పండించుకోవచ్చు.
- తేలికపాటి నేలలు, ఎర్ర ఇసుక, తువ్వ నేలల్లో మిశ్రమ పంటలను సాగు చేసుకోవచ్చు. కంది పంటను సాగు చేయడం వల్ల నేల పైరు ఆకులు రాలి పోవడంతో భూసారం వృద్ధి చెందుతుంది.

సమీకృత సాగు.. బాగు

సమీకృత వ్యవసాయంతో అనేక లాభాలు పొందవచ్చు. ఈ విధానంపై రైతులు దృష్టి సారించేలా వ్యవసాయ శాఖ అవగాహన కల్పిస్తోంది. చిత్తూరు డివిజన్‌లోని అన్ని మండలాల్లో సమీకృత వ్యవసాయంతో కలిగే లాభాలను శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు వివరిస్తున్నారు. ఒక ఎకరాలో ఫిష్ కల్చర్, వరి, కోళ్లఫారం, కూరగాయలు పండించే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో బోర్లు అందుబాటులో ఉన్న రైతులు వరికి బదులు రాగులు, కొర్రలు, జొన్న, మొక్కజొన్న, సజ్జలు సాగు చేసుకోవచ్చు. వరి పంట సుమారు 120 నుంచి 150 రోజులకు వస్తుంది. అదే చిరు ధాన్యాలు 90 రోజుల్లో పంట పూర్తయి సంవత్సరానికి మూడు పంటలు వేసుకోవచ్చు. ఇలా ఎకరాకు పెట్టుబడి పోను రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఆదాయం ఆర్జించవచ్చు. అదే వరి సాగు చేస్తే రెండు సీజన్లలోనూ రూ.25 వేలు మిగులుతుంది. దీనిని దృష్టిలో రైతులు సమీకృత సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు వివరిస్తున్నారు.

సమీకృత వ్యవసాయంతో లాభాలు



రైతులు సమీకృత వ్యవసాయం చేయాలని విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా ప్రోత్సాహం అందిస్తున్నాం. ఇప్పటికే పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. పంట మార్పిడితో కలిగే లాభాలపై చైతన్యం తీసుకువస్తున్నాం. సమీకృత వ్యవసాయం రైతులకు లాభాసాటిగా ఉంటుంది. రైతులు అవగాహన చేసుకుంటే మేలైన దిగుబడులను సాధించవచ్చు.

-ఉమ, ఏడీ, వ్యవసాయశాఖ, చిత్తూరు

ఆరోగ్యమే మహాభాగ్యం





పల్లెచెరువులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రియాంక, (ఇన్‌సెట్) గోవిందరెడ్డిపల్లెలో గర్భవతులకు పరీక్షలు చేయిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఆమె సోమవారం పల్లెచెరువులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలన్నారు. ఇళ్ల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకూడా చూసుకోవాలన్నారు. అనంతరం వైద్య శిబిరంలో 35 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి సూచనలు, సలహాలిచ్చారు. అదేవిధంగా మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు 46 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. బీపీ, షుగర్‌వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు శ్రీనివాసులు, సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.